# మినీ కథ

భారత రాజధానీ నగరంలో (సామాన్యజ్ఞానం: అనగా జనరల్ నాలెడ్జి లేనివారు సైతం గమనించాలి: అది న్యూఢిల్లీ నగరమని) నివసిస్తూ ప్రజాసేవచేసే (ప్రభుత్వోద్యోగం ప్రజాసేవకే గనుక!) ప్రభుత్వోద్యోగుల జీవన సరళి కడు విచిత్రం! భారత ప్రభుత్వం వారి ప్రవర్తనా నియమావళిని అనుసరించి కేంద్ర ప్రభుత్వోద్యోగులు ఎల్ల వేళలా... అనగా .. 24 గంటలూ డ్యూటీలోవున్నట్లే భావించాలి. కానీ ఈ విషయం మనమిత్రులు కేంద్ర ప్రభుత్వోద్యోగులు అప్పుడప్పుడూ మరిచిపోతుంటారు!

వీరి దినచర్య ఉదయం భోజనానంతరం ఆఫీసుకు పయనమవటంతో ప్రారంభమవుతుంది. పాఠకులకు విసుగు పుట్టకూడదనే సదుద్దేశంతో ఒక సగటు కేంద్ర ప్రభుత్వోద్యోగి దినచర్యను సవినయంగా మనవిచేస్తాను.

* * *

'రాంసేవక్' 'నయీఢిల్లీ' నగరంలోని "కేంద్రీయ సచివాలయ్" (తెలుగువారు దీనిని సెంట్రల్ సెక్రెటేరియట్ అని తెలుసుకోవాలి!) లో ఒక యు.డి క్లర్కుగా పనిచేస్తున్నాడు. అతడి ఇల్లు లక్ష్మీబాయినగరులో వున్నది. అతడి ఆఫీసుకు ఇంటికి నడుమగల దూరం దాదాపు 5 కి.మీ.సిటీబస్‌లో ప్రయాణిస్తే 15ని॥, సైకిలు మీద 20 ని॥ టైముపడుతుంది. అతగాడి సహధర్మచారిణి 'రాంప్యారీ' నాలుగు చపాతీలు, సబ్జీ (అంటే 'కూర' అన్నమాట!) టిఫిన్ బాక్సులోపెట్టి ఇస్తుంది. హడావిడిగా ఉదయం 9 గంటలకు భోజనం ముగించి, అరగంట న్యూస్ పేపర్ తిరగేసి (భార్యామణికి ఇంటి పనిలో, వంటపనిలో సహాయపడతాడు గనుక ప్రొద్దున్నే పేపరుచదవటానికి టైముండదుమరి!) ఆపైన గరమ్-గరమ్ ఛాయ్ త్రాగి, భార్యామణి మూడ్ బాగుంటే ఆవిడ అధరామృతాన్ని గ్రోలి సైకిల్‌పై పయనమవుతాడు- సరిగ్గా 9గం॥ 30 ని॥లకు. దారిలో సైకిలు పంచరవుతే బాగు చేయించుకొని మొత్తంమీద 10గం॥ 10ని॥లకు 'దఫ్తర్' (అనగా కేంద్రీయ సచివాలయ్ : సెంట్రల్ సెక్రెటేరియట్)కు చేరుకొంటాడు. ఆఫీసు టైము ప్రొద్దున్న 10గం॥ 15 ని॥నుండి మధ్యాహ్నం 1-30 గం॥వరకూ, ఆ తర్వాత 2గం॥నుండి సాయంత్రం 5గం॥15ని॥లవరకూ అన్న సంగతి పాఠకులు గమనించాలి (కథాకాలం నాటికి!) సంభాషణలన్నీ హిందీలోనే జరుగుతాయి. కానీ పాఠకుల సౌకర్యార్థం తెలుగులో వ్రాస్తాను!

రాంసేవక్ సరిగ్గా 10గం॥ 15ని॥లకు తన సెక్షన్‌లోకి చేరుకొంటాడు. రాగానే సెక్షన్ ఆఫీసర్‌తో "గుడ్‌మార్నింగ్ సర్!" అంటాడు. (ఆయనకు చెముడు. మన హీరో పంజాబీలో 'ముర్ మారింగ్' అన్నాడేమోనని తిడ్తాడు! కాసేపు వీళ్ళిద్దరికి వాగ్యుద్ధం నడుస్తుంది!) అటెండెన్సు రిజిష్టర్‌లో సంతకం చేశాక తన సీటులో కూర్చొంటాడు!

తోటి 'గుమాస్తా "ఏం భాయీ! డల్‌గా వున్నావేంటి?" అనడుగుతే,

"చాలా అలసిపోయాను నేస్తం! 20 ని॥లు చలిలో సైకిలు త్రొక్కుతూ ఆఫీసుకు రావటం అంటే మాటలా?" అంటాడు!

"ఫరవాలేదులే రెస్టుతీసుకో!" అయాచిత సలహా ఉచితంగా పారేస్తాడో క్లర్కు!

టేబిల్, సీటు శుభ్రంచేసుకోవటం 10 నిముషాలు. 10-30ని॥కు గ్లాసు పట్టుకొనిమంచి నీళ్ళు త్రాగేందుకు కూలరు దగ్గర కెళ్తాడు. 10-40 ని॥కు సెక్షనుకు వస్తాడు. అప్పుడు తనకు మార్క్‌చేసిన ఫైళ్ళను, కాగితాలను ఓ మారు చూస్తాడు. ప్రాముఖ్యత ననుసరించి వాటిని తన టేబులుమీద అమర్చుకొంటాడు.

ఇలా ఓ అయిదు నిముషాలయ్యాక టెలిఫోన్ మ్రోగుతుంది. "హలో!" అంటూ రిసీవ్ చేసుకొని సెక్షన్ ఆఫీసరు: "రాంసేవక్! నీ కోసమే! అంటూ రిసీవర్ అందిస్తాడు.

"హలో మిస్టర్ సి. ఎల్ (చున్నీలాల్!) క్యా బాత్‌హై?" అంటూ స్వ, పర విషయాలు నాటి దేశ రాజకీయ, సాంఘిక, ఆర్థిక విషయాలు మిత్రుడితో ముచ్చటిస్తాడు.

ఇంతలో సెక్షన్‌కు 'టీ' తెప్పించబడుతుంది. రాంసేవక్ టీ సేవిస్తూ, మధ్యమధ్యలో సహోద్యోగులతో ఛలోక్తులు విసురుతూ ఓ పది నిముషాలు కాలక్షేపం చేస్తాడు! ఆ తరువాత "అర్జంటు కాగితాలు" చూసుకొంటుండగా మళ్ళి టెలిఫోను మ్రోగుతుంది. ఈసారి యు. ఎస్ (అండర్ సెక్రెటరీ) నుండి ఎస్. వో (సెక్షన్ ఆఫీసర్) కన్నమాట: సంభాషిస్తూ! భాషిస్తూ పాపం ఎస్.వో షేక్స్‌పియర్ మొహం పెడ్తాడు! ఆ తర్వాత (సమయం 11గం॥ 15 ని॥) రిసీవరు పెట్టేస్తూ...

"రాంసేవక్! ఏమిటా డ్రాఫ్టు! నీమొఖంలా! చూడు! యు.ఎస్ ఎలా తిడ్తున్నాడో! (ఓపంజాబీ బూతు కనబడని యు. ఎస్ మీద!) వళ్ళు దగ్గర పెట్టుకొని పనిచెయ్యి" అంటూ మండిపడ్తాడు.

రాంసేవక్ కసితీరా ఎస్. వో అమ్మ, అక్క, పెళ్ళాం శీలాన్ని శంకించి పైకి మామూలుగా "అలాగే సర్!" అంటూ పనిలో నిమగ్నుడవుతాడు. మరో పదిహేను నిముషాలు రాంసేవక్ డిస్టర్బ్‌కాడు.

11-30 ని॥. "రాంసేవక్ భాయ్!" అంటూ వేరేసెక్షన్ నుంచీ ఓ మిత్రుడడుగెడతాడు! అతగాడిని చూస్తూనే "బోలో కుల్దీప్! ఏంటి విశేషాలు?" అని పరామర్శిస్తూ రాంసేవక్ తన సీట్లోంచి లేచి సెక్షన్ వదిలివెళ్తాడు.

మిత్రులిద్దరూ క్యాంటీన్ చేరుకొంటారు! అక్కడ 'కుల్దీప్ భాయ్' ఖర్చుతో మళ్ళి రాంసేవక్ టీ సేవిస్తూ, అలౌకికానందంతో జాతీయ, అంతర్జాతీయ విషయాల్ని (మధ్యమధ్య ఛాయ్ సెన్స్ బూతులతో నంచుకొంటూ!) చర్చిస్తారు. రాంసేవక్ తన సీటువద్దకు చేరేసరికి 11-45 ని అవుతుంది. ఎస్. వో చేత క్రూరంగా చూడబడిన తర్వాత తన పనిలో లీనమవుతాడు.



# ఉద్యోగి కథ
# మినీ కథ

సమయం: 12 గం 20ని॥. టైపిస్టు గీతా కులకర్ణి టైపుచేసిన కాగితాలను రాంసేవక్‌కు అందిస్తూ అలవోకగా నవ్వుతుంది. మన హీరో పరవశుడవుతాడు, నలుగురు బిడ్డల తండ్రయి కూడా!

"యు ఆర్ బ్యూటిఫుల్" అందామనుకొని, దమ్ములు చాలక "యు ఆర్ ఎ బ్యూటిఫుల్ టైపిస్ట్" అని రాంసేవక్ అంటే కనుబొమలు ముడిచిన గీతతో "ఐ మీన్ యూ టైప్ బ్యూటిఫుల్లీ, రియల్లీ!" అని ప్లేట్ ఫిరాయిస్తాడు. ఆమె తెరలు తెరలుగా నవ్వుతుంది.

ఇలా హాసపరిహాసాలతో 12-45 వరకూ గడుస్తుంది. అప్పుడు అసిస్టెంట్ దీనానాథ్ "యార్! చాలా ఠండ్‌గావుంది! లంచ్ టైమవుతోంది! హీటర్ మీద రోటీ గరంచేసుకొందామోయ్!" అంటూ సర్కార్‌వారి రూం హీటర్ మీద తన లంచ్‌బాక్స్ పెడతాడు. రాంసేవక్‌తో సహా మిగిలినవారుకూడా దీనానాథ్‌ను అనుసరిస్తారు! లంచ్ నెమ్మదిగా పూర్తయ్యేసరికి ఒక టింబావు అవుతుంది. చలికాలమవటంచేత ఎండ కాచుకొనేందుకై "రాంసేవక్" తన మిత్రులతో బోట్‌క్లబ్ లాన్స్‌లోకి నడుస్తాడు. అక్కడ ఇతర భవనాలలో పనిచేసే మిత్రులని పరామర్శిస్తూ, వేరుశనక్కాయలుతింటూ, మధ్యమధ్య వీలునుబట్టి రామాయణాది పురాణ కథలు వింటూ (కొందరు గ్రూపులుగాచేరి పురాణ కథాకాలక్షేపం చేస్తారులెండి!) ఒకోసారి చతుర్ముఖ పారాయణాలను పరికిస్తూ మధ్యాహ్నం రెండుంబావుదాకా గడుపుతారు!

రాంసేవక్‌తోసహా అందరూ తమతమసీట్ల వద్దకు చేరుకొనేసరికి మధ్యాహ్నం రెండున్నర అవుతుంది. మనహీరో నెమ్మదిగా ఫైల్సుచూస్తూ నోట్సు పుటప్‌చేస్తూ, డ్రాఫ్ట్సురాస్తూ కార్య నిమగ్నుడయివుంటాడు. ఇలా ఒక అరగంట గడుస్తుంది.

ఇంతలో... మళ్ళీ ఫోను మ్రోగుతుంది. కాల్ రిసీవ్ చేస్కొన్నాక "యార్! మై తేరా సేవక్ బన్‌గయా!" అని విసుక్కుంటూ ఎస్.వో సాహెబ్ రిసీవరును రాంసేవక్‌కు ఇస్తాడు.

"రాం! నేను మనోహర్‌లాల్‌ను మాట్లాడుతున్నాను" అంటూ ఫుల్‌స్టాప్ కామాలులేకుండా మిత్రుడు మొదలెడితే మన హీరో అంతకంటే సంబరంగా రెస్పాన్స్ ఇస్తుంటాడు "మీ కాలనీలో పొరుగువాళ్ళెవరూ?" అనే అంశంతో మొదలై సప్రూ థియేటర్‌లో ప్రదర్శింపబడుతున్న "చర్డీ జమనీ బుడేను" (పంజాబీనాటకం)మీద చర్చతో అంతమయ్యేసరికి మరో పది నిముషాలు పడుతుంది. ఆ తర్వాత ఒక సిగరెట్‌తో రాంసేవక్ తన అలుపుతీర్చుకొని ఇంకో ఫైలుమీద అర్జెంటు డ్రాఫ్టు పుటప్‌చేశాక రిస్టువాచీలో టైము చూసుకొంటాడు.

"బాప్‌రే! అప్పుడే మూడున్నరయిందే" అనుకొని ఛాయ్ పానీకోసం ఎవరిమీద హస్తం వేయాలా అని నాల్గువైపులా పరకాయించి చూడగా కొత్తషర్టు తొడుక్కున్న కొలీగ్ కనిపిస్తాడు. "అరె సునో భాయీ" అంటూ మొదలెట్టి అతడి కొత్తంగీ అందచందాలు వర్ణించి, అతగాడి స్నేహశీలతను పొగిడి మొత్తంమీద "పార్టీ ఇస్తున్నా"నని అతడు చెప్పేంతవరకు వదిలిపెట్టడు. పార్టీ కార్యక్రమాన్ని తన భుజస్కంధాలమీద వహించిన రాంసేవక్ నిర్విఘ్నంగా తన "విద్యుక్తధర్మాన్ని" నిర్వర్తించినందుకు, సంతృప్తులైన కొలీగ్స్ ప్రశంసాపూర్వక ధన్యవాదాలు తెలుపగా, నమ్రతతో స్వీకరించి మిత్రులకు అభివాదాలు తెలుపుతూ రాంసేవక్ మళ్ళీ ఓసారి తన రిస్టువాచి చూసుకొంటాడు. ఎగ్జాక్ట్లీ ఫోర్ ట్వెంటీ!

అర్జంటుగా ఒక ఎంగేజ్‌మెంట్ గుర్తుకురాగా రాంసేవక్ అంతకంటే ప్రభుత్వకార్యం అర్జంటుగా భావించి అండర్ సెక్రెటరీ వద్దకు వెళ్ళి ఆయన ప్రశ్నలకు, సందేహాలకు సంతృప్తికరంగా సమాధానాలు ఇచ్చిన పిమ్మట పుటప్ చేసిన ఫైల్స్‌మీద సంతకాలు తీసికొని తిరిగి సెక్షన్‌కు వచ్చి ఆ ఫైల్సును డిస్పాచ్ క్లర్కుకు అందజేసి తనసీట్లో కూర్చొని మరల తన రిస్టువాచి చూసుకొంటాడు. నాలుగుముప్పై అయిదు.

రాంసేవక్ ఎస్.వో వంక చూసి, "సాబ్ నాకు అర్జంటుపనివుంది, ఇంటికివెళ్ళాలి!" అని అంటూ, ఆయన ఉలికిపాటు నుండి తేరుకొని పర్మిషను ఇచ్చేలోపల (పాపం, ఆ జీవుడు న్యూస్‌పేపరు చూసుకొంటున్నాడుమరి!) రాంసేవక్ సెక్షనుగది దాటి, ఆఫీసు ఆవరణ దాటి, సైకిలుస్టాండ్‌లో టోకెన్ ఇచ్చి తన సైకిలెక్కి కదలబోయి మళ్ళీ తన రిస్టువాచిలో టైము చూస్తాడు. నాలుగూ సలభై! నెమ్మదిగా బయల్దేరి దోవలో ఒకచోట ఆగి కూరగాయలు కొనుక్కొని మళ్ళీ సైకిలు ఎక్కి వేగంగా త్రొక్కుతూ ఇంటికి వెళ్తాడు. తలుపుతట్టి, లోపలకు వచ్చి, ఎదురొచ్చిన భార్యామణికి చేతిసంచీఇచ్చి, బట్టలు మార్చుకొని భార్య ఇచ్చిన ఛాయ్ త్రాగుతూ టైం చూసుకొంటాడు రాంసేవక్. అయిదూ పదిహేను. రూలు ప్రకారమవుతే సరిగ్గా ఈ వేళకి మామూలుగా ఆఫీసు వదిలివేయాలన్న మాట.



చిన్నగా నవ్వుకున్నాడురాంసేవక్. మనస్సులో తనకివాళ్ళ శాంక్షనయిన 2 గంటల ఓవర్‌టైము నోట్‌ను తలుచుకొంటూ!

అయ్యల్లారా! న్యూఢిల్లీలోని ఓ సగటు కేంద్ర ప్రభుత్వోద్యోగి దినచర్య ఈ విధంగా వుంటుంది. మనలోగల అనేకమంది రాంసేవక్‌లు ఈ రచన చదివి తమ భుజాలు తడుముకుంటే దోషం తనదికాదని ఈ రచయిత సవినయంగా మనవి చేసుకొంటున్నాడు. ఇందులో వాడిన పాత్రల పేర్లు కల్పితం. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినవి కావు.

—శ్రీనివాసరావ్ వైద్యుల

## మొహంచూసి అంతాచెప్పేయొచ్చు

నోరు :

1] సమగ్రమైన నోరు : పెదవులు రెండూ సమానంగా నిండుగావుండి, పెదాల చివరలు సరిగ్గా కలుసుకునే నోరువున్న స్త్రీలు అందరికీ ఆహ్లాదంకలిగించేలా ప్రవర్తించగలరు. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తారు. నిండుకుండలా తొణుకుబెణుకు లేకుండా వుంటారు. స్నేహస్వభావం కలిగి వుంటారు.

2] చంద్రవంక పెదవులు: పెదవుల చివర పైకి వొంపుతిరిగిన పెదాలు కలిగిన ఆడది ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ, భవిష్యత్తుమీద దృఢ విశ్వాసంతో సృజనాత్మక శోకతలతో, అందరిలో గుర్తింపుపొందే విధంగా వుంటుంది. కష్ట సుఖాలని సమంగా స్వీకరించగల నేర్పు వుంటుంది. అనుకొనిసోలని వున్నా, నీరసించిపోకుండా హుషారుగా వుంటుంది.

3] విల్లులాంటి పెదవులు : దూరదృష్టి లేనివారిలా, జీవితంపట్ల విముఖత కలిగినట్లు అవుపిస్తారు. స్వార్థపరులుగా పరిగణిస్తారుఅందరూ. కానీ ఎవరినైనా నమ్మితే, వారికోసం ఎంత త్యాగం చెయ్యడానికైనా వెనుకంజ వెయ్యరు.

4] సన్నని విశాలమైన నోరు : అహంకారి. దృఢనిశ్చయం కలిగినవారు. బలవంతులు, ఉదార స్వభావం గలవారు. అవసరానికి అనుగుణంగా మారిపోగలరు.

5] చిన్ననోరు : ఏకాంతజీవులు. కలిసిమెలిసి మెలిగే స్వభావం లోపించటం వలన-అవకాశాలు జారవిడుచుకుంటారు.

6] చేపలావుండే నోరు: పెదాలచివర క్రిందికి ఒంపు తిరిగివుండే స్త్రీలు దృఢ నిర్ణయం, ఆత్మవిశ్వాసం కలిగి, కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడగలిగే స్వభావం కలిగివుంటారు. బద్ధకస్తులు-శృంగారకాముకులు. ఇతరుల సేవలు అందుకోవాలని చూస్తుంటారు.

7] గుండ్రటి పెదవులు : నోరు సున్న చుట్టినట్లుండే ఆడవాళ్ళు దయాహృదయులు. సాధుస్వభావం. ఇంటి పనుల్లో శ్రద్ధ ఎక్కువ చూపిస్తారు. వివాహం త్వరగా చేసుకుని, జీవితాంతం సంతోషంగా గడిపేస్తారు.

మహిళల ముఖబింబాన్ని పరీక్షగాచూసి పై విధంగా వారి మనస్తత్వం తెలుసుకొనే శాస్త్రాన్ని చైనాదేశస్తులు ప్రప్రథమంగా రూపొందించారు. ఫేషియానమీ అనబడే ఈ ప్రక్రియగురించి అంగస్ ఎండ్ రాబర్ట్‌సన్ అనే రచయితలు 'మేక్ అప్ ఫర్ సక్సెస్'అనే పుస్తకంలో మరింత విపులంగా స్త్రీ ముఖ కవళికల రహస్యాలని వెల్లడిచేసారు.●

(సమాప్తం)

—టి. ఉమా.